కంకరతో కష్టాలు

అసంపూర్తిగా రోడ్డు నిర్మాణం | దుమ్ముతో పంటలకు నష్టం | ఇబ్బంది పడుతున్న రైతులు, ప్రయాణికులు



కంకర, చూర పోసి వదివేసిన రోడ్డు

చిట్యాల: మండలంలోని చల్లగరిగ నుంచి రేగొండ మండలం కొడవటంచ గ్రామం వరకు మూడు కిలోమీటర్లు రూ.కోటి 70లక్షల నిధులతో తారు రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ఐదు నెలల క్రితం పనులకు శంకుస్థాపన చేశారు. దీంతో కాంట్రాక్టర్ పనులు ప్రారంభించి కంకర, చూర పోసి వదిలివేయడంతో రోడ్డు నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోయింది. రోడ్డు వెంట వెళ్లే వాహనాదారులు, కొడవటంచకు వెళ్లే భక్తులు అవస్థలు పడుతున్నారు. మార్చి 14న లక్ష్మీ నర్సింహస్వామి జాతర ప్రారంభం కానుంది. ఈ జాతరకు వేలాది మంది భక్తులు ఈ రోడ్డు వెంట వెళ్తుంటారు. ఈ రోడ్డు ఇలాగే ఉంటే ప్రమాదాలకు జరిగే అవకాశం ఉంది.

దుమ్ముతో పంటలకు నష్టం..

కంకర, చూర పోయడంతో వాహనాల రాకపోకలతో దుమ్ము లేస్తుంది. దీంతో రోడ్డు వెంట ఉన్న పంటలపై దుమ్ము పడి రైతులు నష్టపోతున్నారు. దుమ్ము తీవ్రంగా రావడంతో రైతులు పంటల చుట్టూ చీరలను ఏర్పాటు చేశారు. అయిన పంటలపై దుమ్ము పడుతుండడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి పనులు పూర్తి చేయాలని మండలవాసులు కోరుతున్నారు.

రోడ్డు నిర్మాణం చేపట్టాలి..



మూడు నెలల క్రితం చేపట్టిన రోడ్డు నిర్మాణం ఇంత వరకు పూర్తి కాకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నాం. రోడ్డు పక్కన వేసిన పంటలపై దుమ్ముధూళి పడడంతో పంటల పరిస్థితి అధ్వానంగా ఉంది. కావున కాంట్రాక్టర్, అధికారులు త్వరిత గతిన పనులను పూర్తి చేయాలి.

- రావుల సురేష్, రైతు చల్లగరిగ

క్లుప్తంగా

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత



చిట్యాల: మండలంలోని చల్లగరిగ గ్రామానికి భరణ్‌రెడ్డి, మండల కేంద్రానికి చెందిన సతీశ్ మూడు నెలల క్రితం సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. ఈ మేరకు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో సీఈఐఆర్ ద్వారా గుర్తించి బాధితులకు సీఐ మల్లేశ్, ఎస్సై శ్రావన్‌కుమార్ సోమవారం అందజేశారు. సెల్‌ఫోన్ గుర్తించడంలో సహాయపడిన కానిస్టేబుల్ లాల్‌సింగ్‌ను వారు అభినందించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రజలకు ఎక్కడైనా సెల్‌ఫోన్లు దొరికితే పోలీస్ స్టేషన్‌లో అందజేయాలని కోరారు.

పోలీసుల అదుపులో నిందితులు?

టేకుమట్ల: మండలంలోని గర్మిళ్లపల్లి శివారు బోయినిపల్లికి చెందిన సోరుపాక వీరమ్మ అనే వృద్ధురాలు ఇటీవల హత్యకు గురైంది. కాగా నిందితుల్లో ముగ్గురిని అదుపులోకి తీసుకుని మరో వ్యక్తి కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపడుతున్న సమాచారం. మృతురాలు వీరమ్మను హత్య చేయడానికి గల కారణం ఆమెపై ఉన్న బంగారాన్ని చోరీ చేయడమా? లేక మరేదైనా కారణమా? అనే విషయం పోలీసుల దర్యాప్తులో వెల్లడయ్యే అవకాశం ఉంది.

ముగిసిన ఎన్నికలు

కాళేశ్వరం: మహదేవపూర్ మండల కేంద్రంలోని మాడా గెస్ట్‌హౌస్‌లో నిర్వహించిన గిరిజన ప్రైమరీ కో–ఆపరేటివ్ ఎన్నికలు ముగిశాయి. సోమవారం ఎన్నికల అధికారి శైలజ ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. ఇద్దరు మహిళలు కురుసం బుచ్చక్క, మేకల శంకరమ్మ ఏకగ్రీవం అయ్యారు. పోటీ ద్వారా రామినేని వెంకటరాజం, కాల్నేని రామయ్య, పులిసే సమ్మయ్య గెలుపొందినట్లు ఎన్నికల అధికారి పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

టేకుమట్ల: రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి చెందిన సంఘటన మండలంలోని అంకుషాపూర్‌లో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని సోమనపల్లికి చెందిన మారపెల్లి రాజకొమురయ్య (60) మండల కేంద్రానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో అంకుషాపూర్ గ్రామానికి చెందిన బిక్కనూరి సతీశ్ ద్విచక్రవాహనంతో మండల కేంద్రం నుంచి అంకుషాపూర్‌కు వస్తు రాజకొమురయ్యను ఢీకొట్టాడు. అతడికి తీవ్రగాయాలు కావడంతో 108లో చిట్యాల సివిల్ ఆస్పత్రికి తరలించి మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించారు. కాగా, చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి భార్య సమ్మక్క ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై దాసరి సుధాకర్ తెలిపారు.

గోదావరిలో మునిగి..

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని త్రివేణి సంగమ గోదావరిలో స్నానానికి వెళ్లి ప్రమాదశాత్తు నీటిలో మునిగి పంజాల రామయ్య(70) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిట్యాల మండలం నవాబుపేట గ్రామానికి చెందిన రామన్న ఆరోగ్యం బాగాలేదని కాళేశ్వరం వెళ్లి స్నానం చేసి వద్దామని కుటుంబ సభ్యులతో పలుమార్లు చెప్పాడు. వారు నిరాకరించడంతో ఆదివారం ఇంటి నుంచి బయలుదేరి కాళేశ్వరం చేరుకున్నాడు. స్నానం చేస్తుండగా నీటిలో మునిగి మృతి చెందాడు. పోలీసులు కుటుంబ సభ్యులకు తెలుపగా వచ్చి మృతదేహాన్ని గుర్తించారు. కేసు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తమాషారెడ్డి తెలిపారు.

ఒకరికి గాయాలు



రేగొండ: మండలంలోని రంగయ్యపల్లి గ్రామంలోని రైస్‌మిల్ ఎదుట సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రంగయ్యపల్లి గ్రామానికి చెందిన బలుగూరి రాజు ఆటోలో పరకాలకు వెళ్తుండగా ఆటో ముందు వెళ్తున్న టాటాఏస్ వాహనం టైరు పేలడంతో అదుపుతప్పి ఎదురుగా ఉన్న చెట్టును ఢీకొట్టింది. ఈ క్రమంలో వెనక నుంచి వస్తున్న ఆటో అదుపుతప్పి టాటాఏస్ వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ రాజుకు తీవ్ర గాయాలవడంతో మెరుగైన చికిత్స కోసం 108 వాహణంలో వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు.

పనులకు రైతులు సహకరించాలి

కాటారం సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్

కాటారం: చిన్న కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో భాగంగా నిర్మిస్తున్న వీరాపూర్ చెరువు కరకట్ట పెంపు పునరుద్ధరణ పనులకు రైతులు సహకరించాలని కాటారం సబ్ కలెక్టర్, భూ సేకరణ విభాగం జిల్లా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మయాంక్‌సింగ్ కోరారు. కాటారం మండలం వీరాపూర్, రఘుపల్లి గ్రామాల్లో సోమవారం గ్రామసభ నిర్వహించారు. వీరాపూర్ చెరువు కరకట్ట పెంపులో భాగంగా భూములు కోల్పోతున్న భూ నిర్వాసిత రైతులతో మాట్లాడారు. వీరాపూర్ రైతులకు సంబంధించి 22 ఎకరాలు, రఘుపల్లి గ్రామ రైతులకు సంబంధించిన 11 గుంటల భూమి సేకరించనున్నట్లు అధికారులు గ్రామ సభలో వెల్లడించారు. ఏఏ సర్వే నంబర్‌లో ఏ రైతుకు సంబంధించి ఎంత భూమి సేకరించాల్సి వస్తుందో జాబితాను చదివి వినిపించారు. పలువురు రైతులు గ్రామ సభలో తమ అభ్యంతరాలు వెల్లడించారు. గతంలో కోల్పోయిన భూములకు ఇప్పటివరకు పరిహారం అందలేదని పలువురు రైతులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఎక్కువ భూమి కోల్పోతుంటే రికార్డుల్లో మాత్రం తక్కువ భూమి ఎలా నమోదు చేశారని పలువురు నిర్వాసితులు అధికారులను ప్రశ్నించారు. భూ నిర్వాసిత రైతుల డిమాండ్లు, అభ్యంతరాలు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని సబ్ కలెక్టర్ పేర్కొన్నారు. తహసీల్దార్ నాగరాజు, ఎస్సై మ్యాక అభినవ్, రెవెన్యూ, భూ సేకరణ విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశ్నించే వారిని ఎమ్మెల్సీగా గెలిపిద్దాం..

● సామాజిక కార్యకర్త కిరణ్

కాటారం: కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలో నిరుద్యోగుల సమస్యలపై ప్రశ్నించి పోరాడే అభ్యర్థిని ఓటర్లు గెలిపించుకోవాలని సామాజిక కార్యకర్త కిరణ్ అన్నారు. మండల కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాటారం సబ్ డివిజన్ పరిధిలోని పట్టభద్రులు ఏకమై నిరుద్యోగులకు అండగా నిలిచే వారికి మాత్రమే పట్టం కట్టాలని తెలిపారు. అగ్రవర్ణాలకు, అణగారిన వర్గాలకు జరుగుతున్న పోరాటంగా ఎన్నికలను గుర్తించాలని అన్నారు. విద్యా, వ్యాపార రంగాల్లో కోట్ల రూపాయలు దండుకున్న దళారులు ఓట్ల కోసం తిరుగుతున్నారని పట్టభద్రులు అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు.

సరోత్తంరెడ్డిని గెలిపించాలి



ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

భూపాలపల్లి రూరల్: ఎమ్మెల్సీగా బీజేపీ అభ్యర్థి సరోత్తంరెడ్డిని గెలిపించాలని కోరుతూ.. ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు గీస సంపత్ ఆధ్వర్యంలో నాయకులు సోమవారం పట్టణంలోని కళాశాలల్లో ప్రచారం నిర్వహించారు. సరోత్తంరెడ్డి సోదరుడు పులి శ్రీనివాస్‌రెడ్డి ఎన్నికల ప్రచారంలో పాల్గొని టీచర్లకు కరపత్రాలను అందిస్తూ ఓట్లను అభ్యర్థించారు. జిల్లా ఎన్నికల ప్రతినిధి దుప్పటి భద్రయ్య, జిల్లా నాయకులు దొంగల రాజేందర్, తాటికంటి రవికుమార్, కృష్ణారెడ్డి, రమేశ్, వేణు, శ్రీకాంత్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం



సబ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్ఈ మల్సూర్

కాటారం: మండల కేంద్రంలోని 132/33 కేవీ సబ్ స్టేషన్‌లో వలెంకుంట బ్రేకర్ సాంకేతిక లోపం ఏర్పడటంతో కాటారం సబ్ డివిజన్ పరిధిలోని పలు గ్రామాలకు సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. కాటారం, మల్హర్ మండలాల్లో సుమారు నాలుగు గంటల పాటు త్రి ఫేస్ విద్యుత్ నిలిచిపోగా కొన్ని గ్రామాలకు సింగిల్ పేస్ కరెంట్ సరఫరా జరిగింది. విషయం తెలుసుకున్న ట్రాన్స్‌కో ఎస్ఈ మల్సూర్ సబ్ స్టేషన్‌కు చేరుకొని సాంకేతిక సమస్యపై ఆరా తీశారు. ట్రాన్స్‌కో అధికారులు, సిబ్బంది వెంటనే మరమ్మతు చర్యలు చేపట్టారు. తాడిచర్ల, కొయ్యూర్ ఫీడర్లకు లోడ్ మార్చుకుంటూ తాత్కాలికంగా సింగిల్ పేస్ విద్యుత్ సరఫరా అయ్యేలా చూస్తూ మరమ్మతు చర్యలను కొనసాగించారు. సుమారు 3.30 గంటల పాటు శ్రమించి పూర్తి స్థాయిలో విద్యుత్ సమస్యను పరిష్కరించారు. వేసవి కాలం ప్రారంభం అవుతుండటంతో విద్యుత్ వినియోగం పెరిగి లోడ్ ఎక్కువ అవుతుందని అధికారులు పేర్కొన్నారు. విద్యుత్ సమస్య పరిష్కారంలో భాగంగా కాటారం మండల కేంద్రంలో కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈఈ నాగరాజు, ఏఈఈ ఉపేందర్, సిబ్బంది పాల్గొన్నారు.

నైనగుహల్లో శివరాత్రి వేడుకలు



తహసీల్దార్ కార్యాలయంలో ఆహ్వాన పత్రం అందజేస్తున్న నిర్వాహకులు

మల్హర్: మహాశివరాత్రి సందర్భంగా మండలంలో కొయ్యూరు పీవీనగర్, అడవీసోమనపల్లి వంతెన సమీప అటవీ ప్రాతంలోని నైనగుహల ఆలయంలో రేపు(బుధవారం) మహాశివరాత్రి వేడుకలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వహకులు తెలిపారు. మహాశివరాత్రి వేడుకలకు సంబంధించిన ఆహ్వాన ప్రతాలను సోమవారం ప్రభుత్వ కార్యాలయాల్లో, ప్రజాప్రతినిధులకు, నాయకులకు, భక్తులకు నిర్వాహకులు అందించారు. అనంతరం ఆలయ నిర్వాహకులు మాట్లాడుతూ.. బుధవారం ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవ, అఖండజ్యోతి ప్రజలన, ఉదయం 8 గంటలకు మాహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, మధ్యాహ్నం 12.30 గంటలకు ఉత్సవ విగ్రహాలతో శివపార్వతుల కల్యాణం నిర్వహించనున్నట్లు చెప్పారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ఉంటుందని వెల్లడించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ప్రమాద బీమా పాలసీ చేయించాలి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న జర్నలిస్టులు

భూపాలపల్లి రూరల్: జిల్లాలో పని చేస్తున్న ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులందరికీ ప్రమాద బీమా పాలసీ చేయించాలని కోరుతూ.. టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు క్యాతం సతీశ్, సామంతుల శ్యామ్ ఆధ్వర్యంలో జర్నలిస్టులు సోమవారం కలెక్టర్ రాహుల్ శర్మకు వినతిపత్రం అందించారు. సామల శ్రీనివాస్, విజయ్, తడక సుధాకర్, కొంకల సాంబయ్య, సమ్మయ్య గౌడ్, తదితరులు పాల్గొన్నారు.


పులి సంచారంపై అన్వేషణ



పాదముద్రలు అన్వేషిస్తున్న అధికారులు

మల్హర్: పులి సంచారంపై ఫారెస్ట్ అధికారులు అన్వేషణ చేపట్టారు. రెండు రోజుల క్రితం మండలంలో కాపురం అటవీ ప్రాతంలోని చెరువు శివారులో అనుమానాస్పద స్థితిలో ఆవు మృత్యువాత పడిన ఘటనపై రెండో రోజు సోమవారం పులి, ఇతర అటవీ జంతువుల పాదముద్రలపై ఎనిమిల్ ట్రాకర్లతో గాలించినట్లు కొయ్యూరు రేంజర్ రాజేశ్వర్ రావు తెలిపారు. అన్వేషణలో ఆవుపై పులి దాడి చేసిన ఆనావళ్లు ఏమి లేవని పేర్కొన్నారు. ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని చెప్పారు. రెండు, మూడు రోజుల్లో ఆవు ఈననుండగా ఈ క్రమంలో మృతి చెందినట్లు ఆయన స్పష్టం చేశారు. ఆయన వెంట తాడిచర్ల సెక్షన్ అధికారి లక్ష్మణ్, బీటీ అధికారి మహేందర్, సిబ్బంది ఉన్నారు.

అధ్యక్షుడిగా సురేశ్



భూపాలపల్లి అర్బన్: మున్సిపాలిటీ పరిధిలోని వేశాలపల్లి డబుల్‌బెడ్ రూమ్ కాలనీ అధ్యక్షుడిగా మేర సురేశ్‌ను కాలనీవాసులు ఎన్నుకున్నారు. 544 ఇళ్లకు సంబంధించిన డబుల్‌బెడ్ రూమ్ కాలనీ వాసులు వాసులు సోమవారం స్థానిక కమ్యూనిటీ హాల్‌లో ఓటింగ్ నిర్వహించి ఎన్నుకున్నారు. కాలనీలోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని సురేశ్ తెలిపారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

● వైద్యాధికారి స్నేహ



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న స్నేహ

వెంకటాపురం(కె): పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యంగా ఉంటామని వైద్యాధికారి స్నేహ అన్నారు. మండల పరిధిలోని చొక్కాల, రంగరాజాపురం, సూగూరు, వీరభద్రవరం, ఆలుబాక గ్రామాల్లో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో సోమవారం వైద్య శిబిరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. గ్రామస్తులకు సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కాగా, ఎదిర పీహెచ్‌సీని డిప్యూటీ డీఎంహెచ్ఓ క్రాంతికుమార్ సందర్శించారు. వైద్యశాలలో అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు నూరు శాతం లక్ష్యం సాధించేలా కృషి చేయాలని వైద్య అధికారులకు సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు కిరణ్ కుమార్, స్నేహ, డీపీఎంఓ సత్యనారాయణ, సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఫాస్టాగ్ చెక్ పోస్టు వద్ద రోడ్డు నిర్మాణం



ఏటూరునాగారం: మండలంలోని ఏటూరునాగారం 163 జాతీయ రహదారిపై అటవీశాఖ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న ఫాస్టాగ్ చెక్ పోస్టు వద్ద సర్వీస్ రోడ్డును నిర్మిస్తున్నారు. మండలంలోని ఫోర్‌వీల్ వాహనాలకు ఎలాంటి రుసుము లేకుండా వెళ్లేందుకు ప్రత్యేక రోడ్డు నిర్మాణం పనులను అధికారులు సోమవారం చేపట్టారు. దీంతో ఫాస్టాగ్ ముందు నుంచి కాకుండా వెనుక నుంచి వెళ్లే విధంగా వాహనదారులకు వెసులుబాటును కల్పించనున్నారు. దీంతో లోకల్ వాహనదారులకు ఫాస్టాగ్ నుంచి ఊరట కలిగింది.

పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి

ఎమ్మెల్సీ అభ్యర్థి నర్సిరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థి నర్సిరెడ్డి

భూపాలపల్లి అర్బన్: ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న సమస్యలను తాను ఎమ్మెల్సీగా ఎన్నికైన తరువాత మండలిలో మాట్లాడి రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించినట్లు నల్లగొండ–వరంగల్–ఖమ్మం స్వతంత్ర అభ్యర్థి అలుగుబెల్లి నర్సిరెడ్డి తెలిపారు. జిల్లాకేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నర్సిరెడ్డి మాట్లాడారు. 2019లో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిచిన నాటినుంచి నేటి వరకు ఉపాధ్యాయులు, అధ్యాపకుల గొంతుకగా సమస్యలన్నింటిపై శాసన మండలి, బయట స్పందించినట్లు తెలిపారు. ఈ క్రమంలో ప్రభుత్వ ఉద్యోగులకు 30శాతం పీఆర్సీ ఇవ్వాలని ఇందిరాపార్కు వద్ద నిరాహారదీక్ష చేసినట్లు వివరించారు. రానున్న రోజుల్లో సీపీఎస్ రద్దు చేయించి ఓపీఎస్ అమలు, ఎంఈఓ, డిప్యూటీ డీఈఓ, డైట్ లెక్చరర్ల పోస్టులలో పదోన్నతల కల్పనకు, గిరిజన ఆశ్రమ పాఠశాలలు, గురుకుల ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పోరాడుతానని చెప్పారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్, టీపీటీఎఫ్ నాయకులు రావుల రమేష్, కొత్త కుమారస్వామి, సేవానాయక్, వీరన్న, రఘుపతిరెడ్డి పాల్గొన్నారు.

గిట్టుబాటు ధర కల్పించాలని వినతి



డీటీకి వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

వెంకటాపురం(కె): మిర్చి పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతూ బహుజన సమాజ్‌వాది పార్టీ మండల అధ్యక్షుడు గణేశ్ ఆధ్వర్యంలో సోమవారం డిప్యూటీ తహసీల్దార్ మహేందర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గణేశ్ మాట్లాడుతూ.. మిర్చి పంట దిగుబడులు తగ్గడంతో పాటు గిట్టుబాటు ధర లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. దినికి తోటు దళారులు మిర్చి పంటకు ధర తగ్గించి కొనుగోలు చేస్తు రైతులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైన ప్రభుత్వం మిర్చి పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం

● ఎస్సై రాజ్‌కుమార్



క్రీడాకారులతో జంపన్న తదితరులు

వాజేడు: క్రీడల్లో గెలుపోటములు సహజమని ఎస్సై రాజ్‌కుమార్ అన్నారు. మండలంలోని నాగారంలో శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని గ్రామస్తులు వాజేడు, వెంకటాపురం(కె), కన్నాయిగూడెం, ఏటూరునాగారం మండలాల స్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నారు. కాగా, ఈ పోటీలను ఎస్సై సోమవారం ప్రారంభించి మాట్లాడారు. ప్రతీ క్రీడాకారుడు క్రీడా దృక్పథంతో మెలగాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి విక్రాంత్, మాజీ సర్పంచ్ తల్లడి ఆదినారాయణ, నాయకులు దాట్ల వాసు, కల్యాణ్, సీతాలు, సోమ సత్యనారాయణ, గ్రామస్తులు, యువకులు ఉన్నారు.

గంజాయి విక్రయిస్తే కఠిన చర్యలు



వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

వాజేడు: గంజాయి విక్రయిస్తే కఠిన చర్యలను తీసుకుంటామని పేరూరు ఎస్సై గుర్రం కృష్ణప్రసాద్ హెచ్చరించారు. సోమవారం మండల పరిధిలోని ధర్మవరం, పేరూరు గ్రామాల్లో పోలీసులు నార్కోటిక్ స్నీపర్ డాగ్‌తో తనిఖీలను నిర్వహించారు. వెంకటాపురం(కె) సీఐ బండారి కుమార్, పేరూరు ఎస్సై కృష్ణ ప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసులు దుకాణలను సోదాలు చేశారు. ఛత్తీసగఢ్ నుంచి వచ్చి వెళ్లే ప్రతీ వాహనాన్ని సోదాలు చేయడంతో పాటు స్నీపర్ డాగ్‌తో తనిఖీ చేయించారు. ప్రధానంగా గంజాయి పైనే దృష్టిని కేంద్రీకరించి ఈ తనిఖీలు నిర్వహించారు.

యువత అన్ని రంగాల్లో ముందుండాలి

● బీఆర్ఎస్ జిల్లా నాయకుడు జంపన్న



క్రీడాకారులతో జంపన్న తదితరులు

ములుగు: యువత అన్ని రంగాల్లో ముందుండాలని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు జంపన్న తెలిపారు. మెదక్ జిల్లాలో ఈ నెల 27 నుంచి మార్చి 2 వరకు నిర్వహించే రాష్ట్ర స్థాయి బేస్ బాల్ పోటీలకు అండర్ 14 జిల్లా బాలుర టీం వెళ్లనున్నారు. కాగా వారికి జపన్న సోమవారం టీషర్టులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత ఎదగడానికి కావాల్సిన సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్య క్రమంలో రమేష్, సునావత్ రాజశేఖర్, రాజేందర్, ఎండీ యూసఫ్, నేరెళ్ల శ్రీకాంత్, రాజన్న తదితరులు ఉన్నారు.

కుక్కల దాడిలో దుప్పి మృతి



దుప్పి మృతదేహం

కాటారం: అటవీ ప్రాంతం నుంచి గ్రామంలోకి వచ్చిన దుప్పిని కుక్కలు వెంటపడి తరిమి దాడిచేయడంతో దుప్పి మృతిచెందిన ఘటన మహాముత్తారం మండలంలో సోమవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు, అటవీశాఖ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. మహాముత్తారం మండలం పెగడపల్లి అటవీ ప్రాంతం నుంచి సోమవారం ఓ దుప్పి గ్రామంలోకి వచ్చింది. కుక్కలు వెంటపడి దుప్పిపై దాడిచేయడంతో తీవ్రంగా గాయపడింది. గమనించిన గ్రామస్తులు దుప్పిని కాపాడి అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న రేంజర్ వెంకటేశ్వర్లు, డిప్యూటీ రేంజర్ లాయక్ హుస్సేన్ దుప్పిని పెగడపల్లి రేంజ్‌కి తరలించగా కొంత సమయంలోనే మృతిచెందింది. మండల ఇన్‌చార్జ్ పశువైద్యుడు ధీరజ్ దుప్పి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించగా అటవీశాఖ అధికారులు పూడ్చిపెట్టారు. దుప్పి గాయాలపాలవడంతో పాటు గుండెపోటుకు గురై మృతి చెందినట్లు పోస్టుమార్టంలో వైద్యుడు గుర్తించినట్లు తెలిసింది.

కరపత్రాల ఆవిష్కరణ

ములుగు: జిల్లా కేంద్రంలో నగరేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి జాగరణ ఉత్సవాల కరపత్రాన్ని ఆలయ కమిటీ సభ్యులు సోమవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆలయ కమిటీ అధ్యక్షుడు సిరికొండ బలరాం హాజరై మాట్లాడారు. ఈ నెల 26న నగరేశ్వర స్వామి దేవాలయంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకోని ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 5 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు శివుడికి అభిషేకాలు, సాయంత్రం 7 గంటల నుండి శివపార్వతుల కల్యాణం, రాత్రి 10 గంటల నుంచి ఉదయం 5 గంటల వరకు భజన సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు గాదం కుమార్, కొత్తపెల్లి బాబురావు, రాజుకుమార్, శంకర్, రవి, ఓం ప్రకాశ్ ఉన్నారు.